
క్లుప్తంగా

నున్న పాలకేంద్రంలో బోనస్ పంపిణీ



నున్న(విజయవాడరూరల్): నున్న పాలకేంద్రంలో పాలు పోసే రైతులకు సోమవారం బోనస్‌ను పంపిణీ చేశారు. 61 వేల లీటర్ల పాలు పోసిన 184 మంది రైతులకు 3 లక్షల 14 వేల 585 రూపాయలను పాలకేంద్రం ప్రెసిడెంట్ బొంతు శ్రీనివాసరెడ్డి అందజేశారు. రూపాయికి పది పైసలు చొప్పున బోనస్ పంపిణీ చేశామన్నారు. బోనస్‌తో పాటు నూతన సంవత్సరం 2024 క్యాలెండర్ కూడా అందజేశారు. కార్యక్రమంలో రైతులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



పెనమలూరు: యనమలకుదురుకు చెందిన మెండెం హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో రోడ్డు పక్క నివసించే పేదలకు సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధి వీరంకి కీర్తి మాట్లాడుతూ తమ సంస్థ గత 10 ఏళ్లగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. రోడ్డు పక్కన నివసించే పేదలు చలితో ఇబ్బందులు పడుతుండటంతో వారికి ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశామని చెప్పారు. రానున్న రోజుల్లో కూడా అనాథలు, వృద్ధులకు తమ వంతు సేవ అందిస్తామని ఆమె తెలిపారు.

సెల్‌ఫోన్ దుకాణంలో చోరీ

కంకిపాడు: సెల్‌ఫోన్ దుకాణంలో జరిగిన చోరీ ఘటనపై స్థానిక పోలీసు స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. ఎస్ఐ కె.సుధాకర్ తెలిపిన వివరాల మేరకు.. కంకిపాడు పట్టణంలో చుండూరు మణికంఠ అనే వ్యక్తి ఎంటీఎం మొబైల్ దుకాణాన్ని నడుపుతున్నాడు. సోమవారం ఉదయం 11 గంటల సమయంలో దుకాణం తెరిచేందుకు వెళ్లి చూడగా, తాళం పగలకొట్టి ఉండటాన్ని గుర్తించి చోరీ జరిగిందని నిర్ధారించుకున్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. రూ. 1 లక్ష విలువ చేసే 12 సెల్‌ఫోన్లు చోరీ అయినట్లు దుకాణదారుడి నుంచి వివరాలు నమోదు చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెనమలూరు: పెనమలూరు సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలు అవడంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. పోరంకి మేదర్‌బజార్‌కు చెందిన ఇంటూరి మురళీకృష్ణ, అతని మిత్రుడు నాగబాబు ఆదివారం బైక్‌పై పెనమలూరు వెళ్తుండగా పెనమలూరు సెంటర్‌లో వెనుక నుంచి వచ్చిన లారీ వీరి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరూ కిందపడిపోవడంతో గాయాలు అయ్యాయి. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేటి నుంచి ఉత్తరాది మఠంలో భాగవత సప్తాహం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని రథం సెంటర్‌లో ఉన్న ఉత్తరాది మఠం ప్రాంగణంలో మంగళవారం నుంచి భాగవత సప్తాహం నిర్వహించనున్నట్లు మఠం విచారణాధికారి కానుగోవి వాసుదేవాచార్య పేర్కొన్నారు. శ్రీ సత్యాత్మ తీర్థ గురువులు ఆదేశానుసారం జనవరి ఒకటో తేదీ వరకూ ఈ సప్తాహం కొనసాగుతుందని తెలిపారు. ప్రతి రోజూ సాయంత్రం 6.30 గంటల నుంచి ప్రవచన కార్యక్రమం జరుగుతుందన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ఉయ్యూరు: క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ఉయ్యూరు పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లోనూ క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. క్రీస్తును ఆరాధిస్తూ ఆదివారం రాత్రి నుంచే ప్రార్థనామందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొవ్వొత్తులతో ర్యాలీలు నిర్వహించి క్రీస్తు గేయాలను ఆలపించారు. పట్టణంలోని సీబీఎం ప్రార్థనామందిరంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ పాల్గొని కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్రీస్తు చూపిన సేవా భావాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలన్నారు. ప్రేమ, దయ, సహనం అలవర్చుకుని, సమాజ ప్రగతిలో భాగస్వాములు కావాలని సూచించారు. సీబీఎం, ఇమ్మానుయేలు, దళితవాడలోని ప్రార్థనామందిరాల్లో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి క్రిస్మస్ వేడుకలకు హాజరై క్రీస్తు సందేశాన్ని వినిపించారు. ఆయన మాట్లాడుతూ క్రీస్తు బోధనలు ఆచరణీయమన్నారు. శత్రువుకు కూడా మంచి జరగాలని ప్రార్థనలు చేస్తే ఆ ప్రార్థనలే అందరినీ రక్షిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్రీస్తు విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాలయేసు ఆర్‌సీఎం చర్చిలో..

గన్నవరం: స్థానిక బాలయేసు ఆర్‌సీఎం చర్చిలో ఆదివారం అర్ధరాత్రి నుంచే క్రిస్మస్ వేడుకలను ప్రారంభించారు. విచారణకర్త ఫాదర్ పసల థామస్ నేతృత్వంలో బాలయేసు రాకను స్వాగతిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. విజయవాడ బిషప్ హౌస్ నుంచి వచ్చిన ఫాదర్ మేడేపల్లి థామస్ భక్తులకు క్రిస్మస్ సందేశం ఇచ్చారు. స్థానిక సీఎస్ఐ టౌన్ చర్చిలో తెల్లవారుజామున సంఘకాపరి జీవమనోహర్ ఆధ్వర్యంలో క్రిస్మస్ ప్రార్థనలు నిర్వహించారు. చెన్నై నుంచి వచ్చిన రెవరెండ్ బెర్నార్డ్ క్రిస్మస్ సందేశం ఇచ్చారు. స్థానిక గ్రేస్ ఫెలోషిప్ చర్చిలో జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, పాస్టర్ గుండ్రపు సురేష్‌బాబు క్రిస్మస్ కేక్ కట్ చేశారు. బూతిమిల్లిపాడు ఆర్‌సీఎం చర్చిలో విన్సెంట్ ది పాల్ సొసైటీ ఆధ్వర్యంలో 40 మంది వృద్ధులకు నూతన వస్త్రాలు అందజేశారు. సొసైటీ విజయవాడ సెంట్రల్ కౌన్సిల్ అధ్యక్షుడు పీఏ విజయకుమార్, ఉపదేశి డి.కుమార్ పాల్గొన్నారు. కేసరపల్లి, అల్లాపురం, దావాజిగూడెం, బుద్దవరం, అజ్జంపూడి గ్రామాల్లో క్రిస్మస్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు.

గన్నవరం రూరల్‌లో..

గన్నవరం రూరల్: సర్వమానవాళి రక్షణ కోసం ఏసుక్రీస్తు ప్రభువు జన్మించారని మండలంలోని



ఉయ్యూరు సీబీఎం ప్రార్థనామందిరం క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పార్థసారథి, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ

బీబీగూడెం కెరూసో ఎంబీసీ సంఘం చర్చి పాస్టర్ రెవరెండ్ డాక్టర్ డేవిడ్‌రాజ్ భక్తులకు సందేశమిచ్చారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధన జరిగాయి. అనంతరం భక్తులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. విద్యార్థులు, బాలలకు బహుమతులు, స్వీట్లు అందజేశారు. ముస్తాబాద, సూరంపల్లి, చనుపల్లివారి గూడెం, వీరపనేని గూడెం తదితర గ్రామాల్లో క్రిస్మస్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు.

మౌంట్ కార్మిల్ చర్చిలో..

పెనమలూరు: ఏసు ప్రభువు జన్మదినం సందర్భంగా కానూరు మౌంట్ కార్మిల్ మాత చర్చిలో ఆదివారం అర్ధరాత్రి క్రీస్తు జయంతి వేడుకలు, దివ్య పూజ బలి చేశారు. ఫాదర్లు చాలివేంద్ర శౌరి, ఎం.దేవదానం, ఏ.రత్నరాజు, దివ్య పూజ బలి సమర్పించారు. కానూరు, పోరంకి, సాలిపేట, కామయ్యతోపు, గంగూరు, పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫాదర్లు ప్రసంగిస్తూ ఒకరికి ఒకరు ప్రేమాభిమానాలతో పేదవారికి సహాయపడాలన్నారు. బాల ఏసు ప్రదర్శన, చిన్నారుల కోలాటం, నృత్యాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉపదేశకులు, సభ్యులు, గాయక బృందం, భక్తులు పాల్గొన్నారు. కాగా మండల పరిధిలో పోరంకి బీజేఆర్ నగర్, పెనమలూరు, తాడిగడప, యనమలకుదురు, వణుకూరు గ్రామాల్లో కూడా క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో..

పెనమలూరు: కానూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం క్రిస్మస్ వేడుకలను పెనమలూరు మండల పాస్టర్ ఫెలోషిప్ నిర్వహించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ ఏసుప్రభు సేవలను ప్రతీ ఒక్కరు స్ఫూర్తిగా తీసుకుని కష్టాల్లో ఉన్నవారికి సేవ చేయాలని సూచించారు. శాంతి, సహనం ప్రతి ఒక్కరికీ అవసరమని తెలిపారు. వేడుకల్లో నియోజకవర్గ పరిశీలకుడు బొప్పన భవకుమార్, తాడిగడప మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్, పెనమలూరు మండల పార్టీ అధ్యక్షుడు సంగెపు శ్రీనివాసరావు, ఉయ్యూరు చైర్మన్ వల్లభనేని నాని, ఉయ్యూరు పార్టీ అధ్యక్షుడు అబ్దుల్‌కలాం, ఉయ్యూరు ఏఎంసీ చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు, సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, పార్టీ నేతలు తాళ్ల నరేంద్ర, వేమూరి బాలకృష్ణ, చాన్‌బాషా, వల్లే నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు

కంకిపాడు: క్రిస్మస్ పర్వదినాన్ని క్రీస్తు విశ్వాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. క్రీస్తు జననాన్ని స్వాగతిస్తూ ఆదివారం రాత్రి నుంచే కంకిపాడు, ఉప్పలూరు తదితర గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కొవ్వొత్తులు వెలిగించి క్రీస్తు రాకను స్వాగతిస్తూ ప్రార్థించారు. విచారణ గురువులు దివ్య పూజ బలి సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. విద్యుత్ దీపకాంతులతో చర్చిలు ప్రత్యేకంగా ముస్తాబయ్యాయి.

ఫెయిత్ టెంపుల్ చర్చిలో..

నున్న(విజయవాడరూరల్): క్రిస్మస్ పండుగ సందర్భంగా ఫెయిత్ టెంపుల్ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో బ్రదర్ రజనీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. అమెరికా నుంచి వచ్చిన బ్రదర్ రజనీకాంత్‌రెడ్డి తన ప్రసంగంలో సృష్టికర్త అయిన ఏసుక్రీస్తు మానవుడిగా పుట్టాడని తెలియజేశారు. ప్రత్యేక ప్రార్థన అనంతరం అన్నదానం జరిగింది. నున్న సీఎస్ఐ చర్చిలో రెవరెండ్ కె.జాన్‌వెస్లీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని క్రీస్తు జననం గురించి వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని క్రిస్మస్ పండుగ గీతాలను ఆలపించారు. అలాగే నున్న గ్రామంలోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. అంబాపురం సీఎస్ఐ చర్చి, పాతపాడు గ్రామంలో సీఎస్ఐ చర్చిల్లో కూడా క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

విజయవాడరూరల్ మండలంలో..

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలంలోని పలు గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. నిడమానూరులో సర్పంచ్ శీలం రంగారావు ఆధ్వర్యంలో గ్రామంలోని అన్ని చర్చిలకు క్రిస్మస్ కేకులను పంపిణీ చేసి పాస్టర్లను సన్మానించారు. గ్రామంలోని ఎఫ్‌సీసీ మిషనరీ ఆశ్రమం, రామానగర్ కట్టమీది వృద్ధాశ్రమం, పలు చర్చిలకు క్రిస్మస్ కేక్‌లు, పండ్లు, రగ్గులు అందజేశారు. కార్యక్రమంలో పరిమి విష్ణు, అరవపల్లి భద్రయ్య, అంకం విష్ణు, శివ తదితరులు పాల్గొన్నారు.

బాపులపాడు మండలంలో..

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలోని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చిలను విద్యుత్ దీపాలు, క్రిస్మస్ స్టార్లతో అలంకరించారు. ఏసుక్రీస్తు జననాన్ని తెలియజేసే పశువుల పాక, దేవదూతల ప్రతిమలను ఏర్పాటు చేశారు. స్థానిక జ్యోతినగర్ ఆర్‌సీఎం చర్చి, సీఎస్ఐ టౌన్ చర్చి, హోసన్నా మందిర్, కారుణ్య ప్రార్థనా మందిరం, బేతేలు చర్చి, వేలేరు కల్వరిశక్తి మినిస్ట్రీస్ చర్చిల్లో అధిక సంఖ్యలో క్రైస్తవులు ప్రార్థనలకు హాజరయ్యారు.

పేదలకు అన్నదానం..

పెనమలూరు: పెనమలూరు గ్రామంలో క్రిస్మస్ సందర్భంగా సోమవారం పేదలకు అన్నదానం నిర్వహించారు. గ్రామ సర్పంచి, వైఎస్సార్ సీపీ నేత లింగాల భాస్కరరావు మాట్లాడుతూ దాదాపు 40 మంది పేదలకు అన్నదానం చేశామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యుడు వీరంకి రాఘవులు, దేవరపల్లి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



నిడమానూరు చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

హలెల్లూయ మినిస్ట్రీస్ ప్రార్థనా మందిరంలో..

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక హనుమాన్‌నగర్‌లోని హలెల్లూయ మినిస్ట్రీస్ ప్రార్థనా మందిరంలో సోమవారం క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సుంకర సుభాష్‌చంద్రబోస్ ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమరవల్లి కిరణ్‌మూర్తి చేతుల మీదగా 80 మంది మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ చిన్నతనం నుంచి బడి, గుడి పట్ల తనకు అమితమైన ఇష్టం ఉండేదని, బడిలో విజ్ఞానం నేర్పితే, గుడిలో భగవంతుడిపై నమ్మకాన్ని పెంపొందిస్తుందని చెప్పారు. హలెల్లూయ మినిస్ట్రీస్ ప్రార్థనా మందిరం పాస్టర్ శుభాకర్, పంచాయతీ వార్డు సభ్యుడు తాడిశెట్టి శ్రీను పాల్గొన్నారు.

ఉంగుటూరులో..

ఉంగుటూరు: మండలంలోని పలు గ్రామాల్లో క్రీస్తు విశ్వాసులు క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. పెద అవుటపల్లి తంబి పుణ్యక్షేత్రంలో జరిగిన ప్రార్థనల్లో రెక్టర్ ఫాదర్ జోసఫ్ పాల్గొని దివ్య పూజ బలిని సమర్పించారు. క్రిస్మస్ సందేశాన్ని భక్తులకు బోధించారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా తేలప్రోలు, మానికొండ, ఉంగుటూరు, ఇందుపల్లి, ఆత్కూరు, పొట్టిపాడు తదితర గ్రామాల్లో క్రిస్మస్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు.



ఇమ్మానుయేలు ప్రార్థనామందిరంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి



ఫెయిత్ టెంపుల్ చర్చిలో ప్రసంగిస్తున్న బ్రదర్ రజనీకాంత్‌రెడ్డి



కానూరు మౌంట్ కార్మిల్ చర్చిలో ప్రార్థన చేస్తున్న ఫాదర్లు



గ్రేస్ ఫెలోషిప్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిజబెత్ రాణి, ఫాదర్ సురేష్



కానూరు పార్టీ కార్యాలయం క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే పార్థసారథి, పార్టీ నాయకులు

నేటి నుంచి 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు ప్రారంభం

గన్నవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు మంగళవారం నుంచి మండలంలో ప్రారంభంకానున్నట్లు ఎంపీడీఓ ఇ.సత్యకుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ..తొలుత ఈ పోటీలు గ్రామ సచివాలయ స్థాయిలో జరుగుతాయని చెప్పారు. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం జనవరి 10 నుంచి 23వ తేది వరకు మండల స్థాయిలో, 24 నుంచి 30 వరకు నియోజకవర్గ స్థాయిలో పోటీలు జరుగుతాయని వెల్లడించారు. ఈ పోటీలకు సంబంధించి క్రీడా సామాగ్రిని అన్ని గ్రామ సచివాలయాలకు తరలించడంతో పాటు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఈ పోటీలను ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్, పలువురు ప్రజాప్రతినిధులు లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు. ఈ పోటీలను విజయవంతం చేసేందుకు అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సమన్వయంతో పని చేయాలని కోరారు.



గన్నవరంలో సిద్ధం చేసిన ఖోఖో ప్రాంగణం

మహిళలకు ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

రామవరప్పాడు: మహిళల స్వయం ఉపాధి నిమిత్తం ప్రభుత్వ సహకారంతో పలు ఉపాధి కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు ఇంటిగ్రేటెడ్ హ్యూమన్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ చైర్మన్ ఎస్.రూప సోమవారం తెలిపారు. ఈమె మాట్లాడుతూ అడ్వాన్స్ బ్యూటీషన్ కోర్సు, టైలరింగ్, హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తామని చెప్పారు. మూడు నెలల పాటు టైలరింగ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 26 నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభిస్తామని ఆసక్తి ఉన్న మహిళలు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు గురునానక్ కాలనీలోని కార్యాలయంలో గాని, ఫోన్ నెంబరు 9989998779 ను గాని సంప్రదించాలని సూచించారు.

రూ. 5 లక్షలతో వాకింగ్ ట్రాక్ నిర్మాణం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో మంచినీటి చెరువుల మధ్య గ్రామ పంచాయతీ నిధులు ఐదు లక్షల రూపాయలతో వాకింగ్ ట్రాక్ నిర్మించారు. నున్నగ్రామంలో రెండు మంచినీటి చెరువులు కాలుష్యం లేకుండా శుభ్రంగా ఉండాలనే ఉద్దేశంతో చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మించాలని స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్ సూచించారు. దీంతో 460 మీటర్ల పొడవుతో వాకింగ్ ట్రాక్ నిర్మించారు. వాకింగ్ ట్రాక్ చుట్టూ ఫెన్సింగ్ నిర్మించాల్సి వుండగా దానికి అవసరమైన నిధులను జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ప్రత్యేక గ్రాంటును విడుదల చేయనున్నారని గ్రామ పంచాయతీ అధికారులు తెలిపారు. ముఖ్యంగా ప్రజలు తాగే మంచినీటి చెరువు శుభ్రంగా ఉంచాలనే ఉద్దేశంతో ట్రాక్ నిర్మించినట్లు గ్రామ కార్యదర్శి జీటీవీ రమణ పేర్కొన్నారు.



నున్నలో నిర్మించిన వాకింగ్ ట్రాక్

మానస సరోవరంలా..



గ్రామంలో ఉన్న రెండు మంచి నీటి చెరువులను మానస సరోవరంలా అభివృద్ధి చేయాలనే ఆలోచన నుంచి వాకింగ్ ట్రాక్ నిర్మాణం జరిగింది. జల్‌జీవన్ మిషన్ గ్రాంటుతో చెరువు చుట్టూ ఫెన్సింగ్ నిర్మించడం జరిగింది. భవిష్యత్‌లో వాకింగ్ ట్రాక్ చుట్టూ ఫెన్సింగ్ నిర్మించే ప్రతిపాదన కూడా ఉంది. – కాటూరి సరళ, సర్పంచ్

బీమా నగదు అందజేత

భవానీపురం(విజయవాడపశ్చిమ): మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా ఆసరాగా నిలుస్తోందని 47వ డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగ అన్నారు. డివిజన్‌లోని 151వ సచివాలయం పరిధిలోని జొన్నలగడ్డ మస్తాన్ వీధిలో నివసిస్తున్న కర్రి చంటి అనారోగ్యంతో ఆదివారం మరణించారు. దీంతో వైఎస్సార్ బీమా పథకం కింద మంజూరైన రూ.10 వేల నగదును కార్పొరేటర్ గోదావరి గంగ అందచేశారు. ఈ సందర్భంగా గోదావరి గంగ మాట్లాడుతూ వైఎస్సార్ బీమా పథకం కింద వచ్చే మిగిలిన మొత్తం త్వరలో నామిని బ్యాంక్ ఖాతాలో జమ అవుతాయని చెప్పారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగనన్న ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గోదావరి బాబు, రెడపంగు క్రాంతి, సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ పెద్ద వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన స్వామినాథ స్వామి బ్రహ్మోత్సవాలు



చినకంచిలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామం చినకంచిలో శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామీజీ ఆలయ ప్రాంగణంలోని స్వామినాథ స్వామి ఆలయంలో మూడు రోజులపాటు నిర్వహించిన ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. చినకంచి ట్రస్టీ మొక్కపాటి శర్మ సమక్షంలో గత మూడు రోజులుగా సంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి రోజున ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామినాథ స్వామి బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. చివరి రోజున వేద పాఠశాల విద్యార్థులతో కలిసి ట్రస్టీ మొక్కపాటి శర్మ పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వేదపండితులు స్వామివారికి చక్రస్నానం చేసి వసంతోత్సవం నిర్వహించారు. అలాగే స్వామినాథ స్వామి ఆలయ నిర్మాణ దాతలు మాగంటి సత్యనారాయణ మూర్తి, మధురావు తదితరులు వేద పాఠశాల విద్యార్థులను సన్మానించారు.





విష్ణు సహస్రనామ పారాయణం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో సోమవారం ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యాన పారాయణం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు గోదా రంగనాథ స్వామివార్లకు పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో పారాయణం చేశారు. ఆలయ అర్చకులు పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను పారాయణ మండలి కన్వీనర్ మండలపర్తి సత్యశ్రీహరి పర్యవేక్షించారు.



భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు

నగరంలోని అన్ని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. గుణదల మేరీమాత, వన్‌టౌన్, పటమట, అజిత్‌సింగ్‌నగర్‌లోని ప్రధాన చర్చిల్లో జరిగిన ప్రార్థనల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఫాదర్లు క్రీస్తు సందేశాన్ని అందించారు. సమష్టి దివ్య పూజ బలి సమర్పించి, భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. పండుగ శుభాకాంక్షలు తెలిపారు. భక్తులు బాల ఏసును దర్శించుకుని, కొవ్వొత్తులు వెలిగించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలతో కోలాహలం నెలకొంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

